
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 26 మే 2023
5
అన్నమయ్య



సచివాలయంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీ

రాయచోటి: పట్టణంలో వాల్మీకిపేట సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ గంగ ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు, పలు రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని సూచించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కటి వాలంటీర్ల ద్వారా ప్రజలకు వివరించి, అర్హులకు తప్పక అందేలా చూడాలని సూచించారు. అర్హులు, అనర్హుల జాబితాలు పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రతి పేదవానికి ఇంటి నిర్మాణంలో పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. తనిఖీలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జున, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ గంగ ప్రసాద్

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వం

- పాదయాత్రకు వెల్లువెత్తిన ప్రజాభిమానం
- ప్రజల కష్టాలు తెలుసుకున్న నారా లోకేష్
- నాలుగు రోజులు యువగళంకు విరామం
- 30న జమ్మలమడుగులో బహిరంగ సభ


నారా లోకేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సంక్షేమాన్ని మరిచిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 110వ రోజుకు చేరుకుంది. గురువారం వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని ఎస్.కొత్తపల్లె విడిది కేంద్రం నుంచి పెద్దపసుపుల జంక్షన్, పెద్దపసుపుల, పెద్దపసుపుల చావిడి, జమ్మలమడుగు బైపాస్ విడిది కేంద్రం వరకు పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో ముస్లిములు, గ్రామస్తులు, క్రిస్టియన్లు, రైతులతో మాటామంతి, ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ గ్రామాలకు నిధులివ్వకపోగా, గ్రామ పంచాయితీల్లోని రూ.8,660 కోట్లను సర్పంచ్‌లకు తెలియకుండా దొంగిలించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో 25 వేల కి.మీ సిసి రోడ్లు, 30 లక్షల ఎల్ఇడి లైట్లు వేశామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యమైందని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక కుందూనది ముంపు సమస్యను పరిష్కరించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు. రాజోలి ప్రాజెక్టును 2.95 టిఎంసిల సామర్థ్యంతో నిర్మించి, నిర్వాసితులందరికీ పరిహారం ఇస్తామని తెలిపారు. జగన్ పాలనలో పేదలు, దళితుల ప్రాణాలు గాలిలో దీపంగా మారాయన్నారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ వారి సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు. జగన్ అసమర్థ పాలన కారణంగా రాష్ట్రంలో ఆరోగ్యరంగం కుప్పకూలిపోయిందన్నారు. కర్నూలు, అనంతపురం వంటి పెద్దాసుపత్రుల్లో సైతం కనీసం దూది, గాజుగుడ్డలేని దుస్థితి నెలకొందన్నారు. గ్రామ పంచాయితీల నిధులను ప్రభుత్వం దొంగిలించడంతో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడానికి కూడా వారి వద్ద నిధుల్లేవన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. జగన్మోహన్‌రెడ్డి దివాలా ప్రభుత్వాన్ని చూసి కాంట్రాక్టర్లు పారిపోతున్నారు. రోడ్లపై తట్టమట్టి పోసే దిక్కులేదు, నాలుగేళ్లుగా గ్రామ పంచాయితీలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కొన్నిచోట్ల పరువుకోసం సొంత డబ్బులతో పనులు చేసిన సర్పంచ్‌లు ప్రభుత్వం నుంచి బిల్లులు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మైనారిటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. మైనారిటీలకు చెందాల్సిన రూ.5,400 కోట్ల సబ్ ప్లాన్ నిధులను దారిమళ్లించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలకు చెందిన వక్ఫ్ బోర్డు ఆస్తులను వైసిపి నేతలు యథేచ్ఛగా అన్యాక్రాంతం చేస్తున్నారన్నారు. నర్సరావుపేటలో మసీదు స్థలం కబ్జాను అడ్డుకున్న ఇబ్రహీంను దారుణంగా నరికి చంపారని తెలిపారు. పేద ముస్లిం వివాహానికి కానుకగా ఇచ్చే దుల్హన్ పథకాన్ని అడ్డగోలు నిబంధనలతో పూర్తిగా నీరుగార్చారన్నారు. దుల్హన్ పథకం కింద టిడిపి హయాంలో 32,722 మందికి 163.61 కోట్లు అందజేస్తే, వైసిపి ప్రభుత్వం ఊరికి ఒకరిద్దరికి కూడా పథకాన్ని ఇవ్వలేదని తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చాక దుల్హన్ పథకంలో వైసిపి పెట్టిన షరతులన్నీ తొలగిస్తాం, అర్హులందరికీ పథకం అమలు చేస్తాం. గతంలో మైనారిటీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరిస్తామన్నారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటుచేసి మైనారిటీల స్వావలంబనకు కృషిచేస్తాం. జమ్మలమడుగులో మైనారిటీలకు కమ్యూనిటీ హాలు, ఉర్దూ పాఠశాల, ప్రత్యేక శ్మశానవాటిక నిర్మిస్తామన్నారు. అర్హత ఉన్న బీడీ కార్మికులందరికీ ఉచితంగా పక్కా ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, పుత్తా నరసింహారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, టిడిపి నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కె.జి.ఖదీర్, సయ్యద్, రఫీ, నజీర్, జి.కె.గైబు, బిసి నాయకులు ఎ.కొండయ్య, రాష్ట్ర కార్యదర్శి జె.రమణారెడ్డి, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.

నాలుగు రోజులు యువగళంకు విరామం

గురువారం మధ్యాహ్నం యువగళం యాత్ర పెద్దపసుపుల రోడ్డులోని జమ్మలమడుగు బైపాస్ వద్ద 110వ రోజు ముగిసింది. 26, 27, 28, 29వ తేదీల్లో నాలుగు రోజులు యాత్రకు విరామం ప్రకటించారు. మహానాడు కార్యక్రమం వలన ఈ యాత్ర ఆగినట్లు యువగళం మీడియా కో-ఆర్డినేటర్ తెలిపారు. ఇప్పటికీ మొత్తం యాత్ర 1423.7 కి.మీ సాగింది. 110వ రోజు 12.3 కిలోమీటర్లు సాగింది. ఈ నెల 30వ తేదీన తిరిగి యువగళం యాత్ర పునఃప్రారంభమవుతుంది. అదే రోజు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

పకడ్బందీగా రీసర్వే చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రీ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని గ్రామ, మండల సర్వేయర్లకు కలెక్టర్ గిరీష ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని 450 మంది గ్రామ, మండల్ సర్వేయర్లకు కలెక్టర్ మెడికల్, స్టేషనరీ కిట్లను అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రీ సర్వేను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామ సర్వేయర్లు, సర్వేశాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి దశలో పూర్తి అయిన గ్రామాలకు సర్వే రాళ్లను యుద్ధ ప్రాతిపదికన పాతాలన్నారు.అదే విదంగా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి జయరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా సర్వే అండ్ సెటిల్మెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో రీసర్వే ప్రక్రియలో భాగంగా థర్మామీటర్, సెలోవన్ యాంటీబయోటిక్ లోషన్, పారాసెట్మాల్ టాబ్లెట్, బ్యాండేజ్ మొదలకు 15 అంశాలు కలిపి మెడికల్ కిట్ తో పాటు ప్రథమ చికిత్స నిమిత్తం కలెక్టర్ చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. అలాగే స్టేషనరీలో భాగంగా పేపర్స్, ఫైల్ పాడ్స్, పెన్స్ మొదలకు 24 అంశాలు కలిపి ఈ రెండు కిట్లను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.


సిబ్బందికి సర్వే కిట్లు అందజేస్తున్న కలెక్టర్ గిరీష

కారును ఢీకొట్టి గుంతలోపడ్డ బస్సు

- 63 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- బాధితుల్లో ఏడుగురి పరిస్థితి విషమం
- క్షతగాత్రులను పరామర్శించిన ఆర్‌డిఒ, డిఎస్‌పి


కారును ఢీకొట్టి గుంతలోపడ్డ బస్సు, గాయపడిన మహిళను ఆస్పత్రికి తీసుకువస్తున్నయువకులు, మహిళను పరామర్శిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బెంగళూరు నుండి మదనపల్లెకు వస్తున్న ప్రయివేటు బస్సు బోల్తాపడి 63 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలైన సంఘటన మదనపల్లెలో చోటుచేసుకుంది. ముందు వెళ్తున్న కారును బస్సు ఢీ కొట్టింది. బస్సు అదుపు తప్పి లోయలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 70 మంది ప్రయాణికుల్లో 63 మంది తీవ్రంగా గాయపడగా వారిలో ఏడుగురి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. వివరాలలోకి వెళితే...గురువారం ఉదయం బెంగళూరు నుంచి మదనపల్లి మీదుగా తిరుపతికి వెళుతున్న ప్రయివేట్ ప్రైవేట్ బస్సు ఉదయం సుమారు 10 గంటల సమయంలో మదనపల్లి సమీపంలోని, బెంగళూరు రోడ్డు వేంపల్లి పంచాయతీ కూకటిమాను గడ్డ వద్ద ముందు వెళుతున్న కారును వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పి ఎడమవైపున రోడ్డు పక్కన వుండే 20 అడుగుల లోతున్న గుంతలోకి బోల్తా పడింది. ఈ హఠాత్ పరిణామంలో బస్సులో ప్రయాణిస్తున్న 70 మందిలో 63 మంది తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చుట్టుపక్కల ఉన్న ప్రజలు, రైతులు, గ్రామస్తులు అక్కడికి చేరుకుని, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రూరల్ సిఐ సత్యనారాయణ, ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయిన వారందరిని స్థానికుల సాయంతో సురక్షితంగా బయటికి తీశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న 108 వాహన సిబ్బంది గోపి, మను, మస్తాన్, చలపతి తదితరులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు.బాదితుల్లో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి కి రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కేశప్ప, ఆర్డీవో మురళిలు జిల్లా ఆస్పత్రికి చేరుకుని గాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. బస్సు ప్రమాద ఘటనపై లోతుగా దర్యాప్తు చేసి బాధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్షతగాత్రులను పరామర్శించిన ప్రజాప్రతినిధులు

మదనపల్లి-బెంగళూరు రోడ్డులో బస్సు బోల్తాపడ్డ ఘటనలో గాయపడి మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మాజీ ఎమ్మెల్యేలు దొమ్మలపాటి రమేష్, షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజరెడ్డి, వైస్ చైర్మన్ జింకా చలపతి, జనసేన నాయకులు రామ్ దాస్ చౌదరి, వైసిపి నాయకులు నరేష్ కుమార్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. గాయపడ్డ వారికి వైద్యం అందించిన వైద్య సిబ్బందిని, 108 సిబ్బందిని అభినందించారు.


ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న ఆర్‌డిఒ మురళి, డిఎస్‌పి కేశప్ప


క్రీడాకారులకు సర్టిఫికెట్లు ఇస్తున్న కలెక్టర్ గిరీష

జిల్లాకు మంచి పేరు తీసుకురండి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

క్రీడలలో ఇంకా బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ గిరీష గురువారం పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి మూడు రోజులు పాటు అరుణాచల ప్రదేశాల్లోని ఇటానగర్లో జరిగిన రెండవ జాతీయ ఫ్లోర్ క్లరింగ్ సీనియర్ ఛాంపియన్ షిప్ 2023 పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటటంపై కలెక్టర్ అభినందించారు. చిన్నమండెం మండలం, దేవలంపేట సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ కె.మేరి సుష్మ ఫ్లోర్ క్లరింగ్ సీనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో సత్తా చాటి కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. సబ్ జూనియర్ కేటగిరీలో వై కిస్టియానా, టి.జన్నిఫర్ సులోచన కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిని కలెక్టరేట్లోని కలెక్టర్ వారి చాంబర్లో కలెక్టర్ అభినందించి క్రీడల్లో ఇంకా బాగా రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

హోమ్ ఎక్స్‌పోను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ నెల 26, 27, 28 తేదీల్లో మూడు రోజులు పాటు స్థానిక ఎంఎస్సార్ థియేటర్ ఎదురుగా ఉన్న వీధిలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో హోమ్ ఎక్స్‌పో-2023 కార్యక్రమాన్ని మదనపల్లిలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేస్తున్నామని మదనపల్లి లైసెన్సుడ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు జాకీర్ హుస్సేన్ తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగే హోమ్ ఎక్స్‌పో కార్యక్రమం పూర్తిగా ఉచితమని, ఇక్కడ గృహ నిర్మాణాలు చేపట్టే వారికి అవసరమైన అన్ని రకాల వస్తువుల స్టాళ్లతోపాటు ఇంటీరియర్ డెకరేటింగ్ స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమంలో పాల్గొనే ప్రజలందరికీ ఉచిత బహుమతులు సైతం అందజేస్తున్నట్లు తెలిపారు. హోమ్ లోన్స్‌కు సంబంధించిన స్టాళ్లు కూడా సంబంధిత బ్యాంకర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని కూడా తెలిపారు. కావున మదనపల్లి పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మహేంద్ర బాబు, ట్రెజరర్ ఎం.రెడ్డి నాగరాజు, ఈసీ సభ్యులు పి.సురేష్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంజనీర్ల సంఘం అధ్యక్షులు జాకీర్ హుస్సేన్

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

2023 ఖరీఫ్ సీజన్ పంట కాలానికి సంబంధించి మండలంలోని 18 రైతు భరోసా కేంద్రాల పరిధిలో వేరుశనగ విత్తనకాయలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనం కొరకు రైతులు తమ ఆధార్ కార్డు సమర్పించి ముందుగా కృషి యాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 1628 క్వింటాళ్ళ వేరుశనగ విత్తనకాయలు కేటాయించారన్నారు. ఇప్పటికే 1300 క్వింటాళ్ల విత్తనం పంపిణీ చేసేందుకు ఆర్బీకేలలో సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక బస్తా (30 కిలో) ధర రాయితీ మినహాయించి రూ.1674 ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు తమ పరిధిలోని ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేసుకొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల సేవలను సకాలంలో వినియోగించుకోవాలని వెల్లడించారు.

డివిజన్ కార్యాలయాన్ని సందర్శించిన ఎస్ఇ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉమ్మడి జిల్లాల విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ గురువారం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. విద్యుత్ ప్రమాదాల మీద అవగాహన కల్పిస్తూ సిబ్బందికి, వినియోగదారులకు తగు సూచనలు చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు డబ్బులు చెల్లించిన నెల రోజుల లోపు వారికి విద్యుత్ సరఫరా సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. విద్యుత్ బకాయిలను వసూలు చేసి నాణ్యమైన విద్యుత్తును వినియోగదారులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు వస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఇఇ సురేంద్రనాథ్, భాస్కర్, మురళీధర్, డివిజన్ ఎఇలు, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

'పర్సా' ఆశయాలు కొనసాగిస్తాం : సిఐటియు



సత్యనారాయణ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కార్మిక ఉద్యమ నిర్మాత పర్సా సత్యనారాయణ ఆశయాలను కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో పర్సా సత్యనారాయణ శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన చిత్రపటానికి సిఐటియు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం నుంచి 1970 నుండి 2022 వరకు సిఐటియులో పనిచేశారని తెలిపారు. ఆయన అనేక నిర్బంధాలను ఎదుర్కొని కార్మికుల సమస్యల మీద రాజీలేని పోరాటాలు నిర్వహించారని తెలిపారు. 1924, జూన్ 2న జన్మించారని పేర్కొన్నారు. 19 సంవత్సరాల వయ సులోనే నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారని తెలిపారు. కార్మికుల జీవితాలలో వెలుగు నింపడానికి ఉద్యమాలను ఆయుధంగా చేసుకున్నారని చెప్పారు. సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశంఖం పూరించడానికి ఆయన ఆధ్యుడిగా నిలిచారని పేర్కొన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ స్థాపించి కార్మికుల జీవితాల్లో మార్పు కోసం అనేక పోరాటాలు యూనియన్ ద్వారా నిర్వహించారని కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను అమలు చేస్తున్న నేపథ్యంలో పర్సా పోరాట స్ఫూర్తితో లేబర్ కోడ్‌లు, వ్యవసాయ వ్యతిరేక నల్ల చట్టాలు రద్దయేంతవరకు ప్రభత్వ సంస్థల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు సి.రవికుమార్, సురేంద్ర బాబు, ఓబులమ్మ, జిల్లా కమిటి సభ్యులు శంకర్, లక్ష్మిదేవమ్మ నాగరాజమ్మ పాల్గొన్నారు.

'సిపిఎస్ రద్దు చేయాల్సిందే'

ప్రజాశక్తి రాయచోటి

ప్రతి నెల ఒకటవ తేదీన ప్రభుత్వ ఉద్యోగస్తులకు అందరికీ జీతాలు చెల్లించేలా చట్టం తేవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగాల సంఘం జిల్లా అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన దశల వారి ఉద్యమంలో భాగంగా ఎపిజిఇఎ రాయచోటి తాలూకా కార్యవర్గ సభ్యులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి జిల్లా, తాలూకా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయ, కాంట్రాక్టు, కార్మిక, పెన్షనర్ల, సిపిఎస్ ఉద్యోగులు, గ్రామ వార్డు సచివాలయ అన్ని సంఘాల మద్దతుతో ఉద్యోగులు అందరూ కలిసి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారన్నారు. ఉద్యోగులకు రావలసిన ఆర్థిక బకాయిలు, అనేక సమస్యలు, సిపిఎస్ రద్దు అంశం, ప్రతి నెల ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించేలా చట్టం తేవాలన్నారు. జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ ఇప్పుడు జరుగుతున్న రిలే నిరాహార దీక్ష శిబిరాలలో వందలాది ఉద్యోగులు పాల్గొంటూ ఇప్పటికైనా ఉద్యోగులకు ప్రభుత్వం ఆర్థిక ఏంచేస్తుందని ఆర్థిక న్యాయం చేస్తుందని ఉద్యోగస్తులు ఎదురుచూస్తున్నారు అన్నారు. కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు, సాయి కుమార్, కార్యదర్శి సుజిత్, ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి యం.నరసింహులు, ఎపిజిఇఎ జిల్లా ట్రెజరర్, సుధాకర్ రాజు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మహేశ్వరరాజు, రెడ్డినాయక్, పి.రవీంద్రనాథ్, వివేకానంద, జాయింట్ సెక్రటరీ, కృష్ణవేణి, ప్రవీణ్ రాజు, శివ రామిరెడ్డి, ఎన్‌జిఒ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ రాయచోటి అధ్యక్షులు, మధు సుధన్‌రెడ్డి, జిల్లా విశ్రాంత ఉద్యోగల జిల్లా అధ్యక్షుడు, ఎన్జీవో హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్, రాజా, వైస్ ప్రెసిడెంట్ జయ రామచంద్ర, కోశాధికారి, దేవలా నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, డాక్టర్ భాస్కర్ రెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్, పుల్లంరాజు, జిల్లా ఖజానా శాఖ ఉద్యోగులు, వీఆర్వోలు పలు ఉద్యోగ సంఘా పాల్గొన్నారు.


రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మికులు

రైతులకు త్వరగా భూ పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు జూన్ మాసాంతంలోగా భూసేకరణ అవార్డ్స్ పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాయచోటి కలెక్టరేట్ నందలి మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ అంశాలపై సంబంధిత తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఆర్‌డిఒ, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగు, తాగునీరు సమస్యలు అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను చేపట్టిందని పేర్కొన్నారు. ఇందుకు ఆయా పథకాలకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా రాయచోటి నియోజకవర్గంలో రామాపురం, ఎల్.ఆర్.పల్లి, గాలివీడు, సంబేపల్లి, చిన్నమండెంలలోని చెరువులకు నీరు నింపేందుకు చేపట్టిన లిఫ్ట్ స్కీముకు 137 ఎకరాలు అవసరం కాగా ఇప్పటివరకు 66 ఎకరాల భూ సేకరణ చేయడం జరిగిందన్నారు. మిగిలిన భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందుకు మొదట ప్రాథమిక ప్రకటన జారీ చేసి అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. సంబంధిత యజమానులతో మాట్లాడి.. రేట్లు ఫిక్స్ చేయాలని, తర్వాత అవార్డు పాస్ చేసి భూమిని సంబంధిత శాఖకు అప్పగించాలని సూచించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 భూ సేకరణలో భాగంగా మదనపల్లి, మొలకలచెరువు, పిటీఎం, తంబళ్లపల్లి లలో 185 ఎకరాలు అవసరం కాగా 60 ఎకరాలు, యూనిట్-2 ముదివేడు బ్రాంచ్ రిజర్వాయరుకు సంబంధించి 1075 ఎకరాలకు గాను 446.50 ఎకరాలు సేకరించడం జరిగిందన్నారు. మిగులు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సందరరేగా భూసేకరణ అంశంలో ఆయా అంశాలకు సంబంధించి ఏర్పడిన సమస్యలు, ఇబ్బందులు, వాటి పరిష్కారాలు తదితరాలపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు జారీ చేశారు. భూ సేకరణలో ఒక కాల పరిమితి నిర?యించుకొని ప్రణాళిక బద్ధంగా నిర్దేశించిన సమయంలో గా భూసేకరణ చేసి జిల్లా అభివ ృద్ధికి పాటుపడాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్, డిఆర్‌ఒ సత్యనారాయణ, ఆర్‌డిఒ రంగస్వామి, ఎస్‌డిసిలు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత తహశీల్దార్లు పాల్గొన్నారు.



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఇఒ, ఆర్గనైజింగ్ సెక్రటరీ

నేటి నుంచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు

ప్రజాశక్తి-సుండుపల్లె

మండలంలో శుక్రవారం జరిగే రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ క్రీడా పోటీల నిర్వహణ కొరకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సకలహంగులతో సర్వం సిద్ధమైనదని ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండూరు రవీంద్రరాజు, ఎంఇఒ వెంకటేష్ నాయక్ తెలిపారు. ఈనెల 26, 27, 28 తేదీలలో మూడు రోజులపాటు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ పోటీలలో పాల్గొననున్నాయి. ఈ పోటీలలో సుమారు 600 మంది క్రీడాకారులు కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు. ఈ క్రీడల నిర్వహణకు మూడు రోజులపాటు అవసరమైన అన్ని ఏర్పాట్లను సన్నాహక శిబిరాన్ని ఎంఇఒ వెంకటేష్‌నాయక్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు జగదీశ్వరయ్య, వేణుమాధవ్‌రాజు, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. గ్రామీణ ప్రాంతమైన సుండుపల్లెలో రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించడం పట్ల నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి జడ్‌పిటిసి ఇస్మాయిల్, ఎంపిపి రాజమ్మ , డిఇఒ శ్రీరాంపురుషోత్తం, రాష్ట్ర వ్యాయామ విద్య తనిఖీ అధికారి భానుమూర్తి రాజు, డిప్యూటీ డిఇఒ వరలక్ష్మి, ఎంపిడిఒ, తహశీల్దార్, ఉపాధ్యాయులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొంటారని తెలిపారు.

చిట్లూరులో గడప గడపకూ..

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపిడిఒ హైదర్‌వలి పేర్కొన్నారు. 26న చిరుముందరపల్లి, చనిక్కాయపల్లి, హరిజనవాడ రాఘవరెడ్డిగారిపల్లి, చిట్లూరుకస్పా, ముసలిరెడ్డిగారిపల్లె, నారాయణరెడ్డిపల్లిలో పర్యటిస్తారని చెప్పారు. 27న పకీరుపల్లి పాలనగారిపల్లి, ఏకిలపల్లిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరిస్తారని తెలిపారు. ఈకార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామవాలంటీర్లు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆర్‌టిసి బస్టాండ్‌లో పనిచేయని మరుగుదొడ్లు

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండ్‌లో నీటి మోటర్ పని చేయకపోవడంతో మరుగుదొడ్లు మూసివేశారు. నీరు లేక మరుగుదొడ్లను మూసి వేయడంతో ఆర్‌టిసి సిబ్బందితో పాటు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. మదనపల్లి, రాయచోటి డిపోలో ఎక్కువమంది మహిళా కండక్టర్‌లు ఉండటంతో మరుగుదొడ్లు పనిచేయక పోవడంతో అవస్థలు పడుతున్నారు. నీటి మోటార్‌కు మరమ్మతులు చేసి నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు

-ఆందోళన చెందుతున్న ప్రజలు

ప్రజాశక్తి-సుండుపల్లె

అప్రకటిత విద్యుత్ కోతలతో మండల ప్రజలకు ఆందోళనకు గురవుతున్నారు. సమయపాలన లేకుండా విద్యుత్ కోతలు విధిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎక్కువగా భోజనం చేసే సమయానికి కరెంటు పోయిందంటే ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అసలే వేసవి కాలం కావడంతో పగలంతా ఉక్కపోతకు గురై అల్లాడుతున్నామని అన్నారు. రాత్రి సమయంలోనైనా కంటినిండా పోదామంటే కరెంటు లేకపోవడంతో ఉక్కపోత ఒకవైపు, దోమల బెడద మరోవైపుతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సారి విద్యుత్‌కు అంతరాయం కలిగితే రాత్రి 12 గంటల వరకు రాదని వాపోయారు. ఉచిత విద్యుత్‌ను అందిస్తామని చెప్పిన ప్రభుత్వం అప్రకటిత విద్యుత్ కోతలపై దృష్టి పెట్టాలని కోరారు. ఓట్ల కోసం ప్రాధేయపడే ప్రజా ప్రతినిధులు ఇటువంటి సమయాల్లో ప్రజలు కనపడరా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలని కోరుతున్నారు.



నారా లోకేష్‌తో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

యువగళం పాదయాత్రలో 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జమ్మలమడుగు నియోజకవర్గంలోని నెమ్మలదిన్నె, కొటాల పల్లి, పెద్ద పసుపుల గ్రామాల మీదుగా సాగిన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో మాజీ ఎమ్మెల్సీ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బత్యాల మాట్లాడుతూ రాజంపేట మీదుగా యువగళం పాదయాత్రను కొనసాగించాలని నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయనతోపాటు టిడిపి రాష్ట్ర నాయకులు సోమలరాజు చంద్రశేఖర్‌రాజు, తెలుగుయువత అసెంబ్లీ ఉపాధ్యక్షుడు అనుమలగుండం విజయకుమార్, పట్టణ అధ్యక్షుడు రాముయాదవ్, సింగనమల నాగార్జున, తోటప్రసాద్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

- రెండు పాడి ఆవులు మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం ధాటికి రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ, బొమ్మిరెడ్డిపల్లికి చెందిన రైతు కొర్రా నారాయణస్వామికి చెందిన పాడి ఆవులు బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి హఠాత్తుగా మృత్యువాత పడ్డాయి. నారాయణఃస్వామి కుటుంబం పాడిఆవుల మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఆవుల మృతితో కుటుంబం ఒక్కసారిగా నిస్సాహాయ స్థితిలోకి వెళ్లిపోయింది. టమోటా రైతు అయినటువంటి నారాయ ణస్వామి కుటుంబం టమోటాపంట సాగులో తీవ్రంగా నష్టపోయింది. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవడంలో భాగంగా అప్పులు చేసి రెండు పాలు ఇచ్చే పాడి ఆవులను కొనుగోలు చేసి వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కు టుం బాన్ని పోషించుకుంటు న్నారు. ప్రభు త్వం ఆ కుటుంబాన్ని ఆదు కోవాలని గ్రామ స్తులు తెలిపారు. నష్టపోయిన తమను ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.



మృతి చెందిన పాడి ఆవులు

సంక్షేమ పథకాల వారధులు వాలంటీర్లు : 'గడికోట'

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వారధులు గ్రామ,వార్డు వాలంటీర్లని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల కోసం పరితపించే చేతల ప్రభుత్వ మని అన్నారు. గురువారం మండలంలోని సచివాలయ వాలంటీర్లకు పురస్కారాల ప్రదానంలో ముఖ్యఅతిధిగా శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రథ సారధులు, వారధులు గ్రామ,వార్డు వాలంటీర్లన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 25 రకాల సంక్షేమ పథకాలకు బ్రాండ్ అంబాసిడర్లు వాలంటీర్లేనని అన్నారు. ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులకు లేని గౌరవం వాలంటీర్లుకు ప్రజలకు ఇస్తున్నారని అన్నారు. జడ్‌పిటిసి రమాదేవి , కో-ఆప్షన్ సయ్యద్ అమీర్, వైస్ ఎంపిపి సమరసింహారెడ్డి, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయభాస్కర్, ఉప సర్పంచ్ రాజారెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహ రెడ్డి, సర్పంచ్‌లు వెంకట నారాయణరెడ్డి, రమణయ్య, వెంకట్రమణ, జనార్దన్ రెడ్డి, గడ్డం ప్రభాకర్ రెడ్డి, మీరావలి, ఎంపిటిసిలు దస్తగిరి, జగన్ మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శంకర్ నాయుడు, ఉప సర్పంచ్‌లు రాజారెడ్డి, సంజీవరెడ్డి, రఫీ, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, కొండ ప్రసాద్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, గ్రామ వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు. **కలకడ:** ప్రజలకు ప్రభు త్వానికి వారదులు వాలంటీర్లను అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కితా బులు ఇచ్చారు. ముఖ్య మంత్రి



వాలంటీర్‌కు ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



లక్కిరెడ్డిపల్లి : వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఉద్దేశంతో వాలం టీర్ల వ్యవస్థను స్థాపించారని అన్నారు. ఈ ఏడాదిలో ఉత్తమ సేవ లను అందించిన వాలంటీర్లను మూడు విభాగాలు విభజించి వారికి తగిన బహు మతులు నగదు, పభుత్వ ఆదేశాల మేరకు అందివ్వడమే కాకుండా సన్మానించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి శ్రీదేవి రవికుమార్, జడ్‌పిటిసి హారిక, సింగల్‌విండో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య ,ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల చెంతకే పాలనను సిఎం.జగన్ అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎజాస్ అలీ ఖాన్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ రమణ, కో-ఆప్షన్ గౌస్‌సాబ్, ,సర్పంచుల అధ్యక్షుడు ముసల్‌రెడ్డి, ఎంపిటిసిలు రమేష్, శ్యాం, రెడ్డెప్ప, రమణ, శ్రీరాములు,స్వామీ, గంగులయ్య, సర్పంచులు నజీర్ అహమ్మద్, లక్ష్మీ రెడ్డి,లోకేశ్వర్ రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ఆఫ్రోజ్, సుధాకర్, దామోదర్, కళ్ళు రమణ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-గాలివీడు

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి మహబూబ్‌బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్ చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న సమస్యాత్మక గ్రామాలు ఎక్కడెక్కడ ఏమేమి ఉన్నాయో ఎస్ఐ వెంకటశివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా పేకాట, గంజాయి, క్రికెట్ బెట్టింగ్ ఇటువంటి వాటిని అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. స్టేషన్‌లో పోలీస్ సిబ్బంది తక్కువగా ఉన్నారని వాటిని ఏర్పాటు చేయడానికి ఎస్‌పితో సంప్రదించి చర్యలు తీసుకుంటామన్నారు. గురువారం జరిగే సంత సందర్భంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని గేటు నుంచి బస్టాండ్ వరకు ట్రాఫిక్‌ను ఎటువంటి అవాంఛను సంఘటన జరగకుండా సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలందరూ పోలీసులు సహకరించే మరికొన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న డిఎస్‌పి మహబూబ్‌బాషా

కార్మికుడి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విజయా డైరీ బిఎంసిలో కార్మికుడు మృతికి కారణమైన యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం రాయచోటి మండలం ఒరిగ రోడ్డులో పాల డైరీ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గాయపడిన కార్మికులు నాగరాజును పరామర్శించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న విజయ డైరీకి సంబంధించిన బిఎంసి (బల్క్ మిల్క్ ఛిల్లింగ్ సెంటర్) లో ట్యాంక్ కూలింగ్ అవడం లేదని హర్యాన నుండి జోగేంద్ర సింగ్ అనే కార్మికున్ని రప్పించి ఎలాంటి ప్రమాద నివారణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదం సంభవించిందని వివరించారు. కార్మికుడు జోగేంద్ర సింగ్ మృతికి కారణమైన డైరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరణించిన జోగేంద్ర సింగ్ కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, గాయపడిన నాగరాజు కుటుంబానికి రూ.5 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. పోలీసులు, అధికారులు యాజమాన్యంతో కుమ్మక్కై కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదని కార్మికులకు మద్దతుగా సిపియం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సురేంద్ర, శంకర పాల్గొన్నారు.

ఫైనల్‌కు చేరిన నందలూరు 'సికిందర్ లెవెన్స్'

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె లోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, నందలూరు ప్రీమియర్ లీగ్ ఏడవ సీజన్లో భాగంగా జరుగుతున్న హార్డ్ టెన్నిస్ బాల్ ఒపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం జరిగిన మొదటి సెమీఫైనల్ నందు నందలూరు సికిందర్ లెవెన్ జట్టు ఫైనల్ బెర్త్‌ను సొంతం చేసుకుంది. సికిందర్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా రాజంపేట వాసు 11 జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 9 వికెట్లను కోల్పోయి 109 పరుగులు చేశారు. ఆ జట్టులోని విజయ్ అత్యధికంగా 35 పరుగులు చేశాడు. అనంతరం 110 పరుగుల లక్ష్యంతో బదిలో దిగిన సికిందర్ జట్టు,11.1 ఓవర్ల లో మూడు వికెట్లను కోల్పోయి 110 పరుగులు చేసి విజయం సాధించింది. విజేత జట్టులోని జాఫర్ 26 పరుగులు చేయగా, శ్రీనివాసులు రెడ్డి 31 బంతులలో 50 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను సొంతం చేసుకున్నాడు. మధ్యాహ్నం జరిగిన రెండవ సెమీఫైనల్స్ లో వెంకట రాజంపేట గోపి లెవెన్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో ఐదు వికెట్లను కోల్పోయి 170 పరుగులు చేయడం జరిగింది. ఇందులో కిషోర్ 40 పరుగులు, లడ్డు 28 పరుగులు సాధించడం జరిగింది. అనంతరం 171 పరుగుల విజయ లక్ష్యం తో బరిలో దిగిన కడప సన్నీ లెవెన్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 153 పరుగులు చేసి పరాజయం చెందింది. కడప జట్టు ఆటగాడు హరి నాట్ అవుటుగా 51 పరుగులు చేసిన తమ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. వెంకట రాజంపేట జట్టు ఆటుగాడు కిషోర్ తమ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించడంతోపాటు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షులు కుర్రామణి యాదవ్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఆదివారం నందలూరు సికిందర్ లెవెన్స్, వెంకట రాజంపేట గోపి లెవెల్స్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హిమోగ్లోబిన్‌పై ఎఎన్‌ఎంలకు అవగాహన

ప్రజాశక్తి-పుల్లంపేట

కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక వైద్యాధికారి మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ శాతం నూటికి నూరు శాతం కచ్చితంగా వచ్చే పరీక్షలపై ఎఎన్ఎం లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మనోజ్ చంద్ర మాట్లాడుతూ సహలీస్ పద్ధతి ద్వారా చేసే ఈ పరీక్ష హిమోగ్లోబిన్ శాతం, నూటికి నూరు శాతం కచ్చితంగా తెలుస్తుందన్నారు. తద్వారా రక్తము తక్కువగా ఉన్న గర్భిణులను గుర్తించి వారికి రక్తం అభివృద్ధి చెందడానికి ఐరన్ మాత్రలు, ఇంజక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ బి. రాజా, సూపర్వైజర్ హారో హరమ్మ, శివకుమారి, శివ గౌరీ, మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న కుమార్, మహిళ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి-పీలేరు

క్షయ వ్యాధి గ్రస్తులకు మంచి పోషకాహారాన్ని ఇవ్వడం ద్వారా వారు త్వరగా ఆరోగ్య వంతులౌతారని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వైద్యులు, వైద్య సిబ్బందిచే ఏడుగురు టిబి వ్యాధి గ్రస్తులకు మూడవ విడత పోషకాహారం పంపిణి జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి వ్యాధి గ్రస్థులుకు మంచి పోషకాహారం ఇవ్వడం వల్ల వారు తొందరగా కోలుకుంటారని, ఇదిరోగికీ, సమాజానికి కూడా ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తమ భాధ్యతగా ఓ టిబి వ్యాధి బాధితుడిని దత్తత తీసుకుని, పోషకాహారం అందించే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు టిబి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, సూపెర్వైజర్లు పవన్ కుమార్, మోహన్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై మక్కువ చూపాలి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారాఅర్హులైన వారికి పండ్ల తోటలు పెంచడానికి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు చొరవ చూపాలని ఎంపిడిఒ శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపాధిహామీ టి ఎలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిసిలు, గ్రామసచివాలయ హార్టికల్చర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిఒ మురళి మాట్లాడుతూ జాబ్ కార్డ్ కలిగిన కుటుంబానికి, అయిదు ఎకరాల భూమి లోపల ఉన్న వారికి ఉపాధిహామీ పథకం ద్వారా పండ్ల తోటలు పెంపకం చేపట్టవచ్చని పేర్కొ న్నారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు శంకరమ్మ, లక్ష్మీదేవి, హార్టికల్చర్ సిబ్బంది మల్లికార్జునాయుడు, సుధాకర్, సుప్రియ, టిఎలు పాల్గొన్నారు.

ఇంటి పట్టాల కోసం నిరసన

ప్రజాశక్తి-కురబలకోట

మండలంలోని ముదివేడు గ్రామం గొల్లపల్లెకు చెందిన దళితులు రెడ్డెన్న, ఆదిలక్ష్మి దంపతులు వారికి ఇచ్చిన ఇంటి పట్టాల స్థలాలను చూపాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టారు. బాధిత దంపతుల కథనం మేరకు 12 ఏళ్ల క్రితం ముదివేడు కస్పాలో ఆదిలక్ష్మి, అనే ఆమె పేరుతో రెండు ఇంటి పట్టాలు ఇచ్చారని తెలిపారు. వీటిని వారి సమీప బంధువు ఒకరికి ఒకరు అక్రమంగా అమ్ముకున్నట్లు బాధితులు చెబుతున్నారు. తమకు ఇంటి పట్టాలుగా ఇచ్చిన పట్టాలను తమకు స్వాధీనం చేయాలని ఒకటిన్నర సంవత్సరంగా రెవెన్యూ అధికారులతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. న్యాయం కోసం అర్జీలు కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం కూడా ఇంటిపట్టాల వ్యవహారంపై తహశీల్దారు కార్యాలయంకు వచ్చామని, అక్కడి రెవెన్యూ అధికారి రోజా ఇదేనా పని బయటకు పోండని వారిని గద్దించినట్లు చెప్పారు. న్యాయం కోసం అడిగితే బయటకు పొమ్మంటారా.. అంటూ కార్యాలయం ముందే దంపతులతో పాటు వారి ఆరు మంది ఆడబిడ్డలతో బైఠాయించి, వారి వెంట పెట్రోల్ బాటిల్ కూడా తెచ్చుకున్నారు. న్యాయం జరగకపోతే, పెట్రోల్ పోసుకుని చనిపోతామని హెచ్చరించారు. దీంతో కార్యాలయం వద్ద ఆందోళన ఉద్రిక్తకర పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులకు. సమాచారం ఇచ్చారు.అక్కడి రెవెన్యూ ఉద్యోగులు జోక్యం చేసుకుని పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకొని న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

మండల అభివృద్ధికి సహకరించాలి :ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

మండల అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు సహకారంతోనే మండల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.మండలం రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయ అధికారిని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు, కూలీలకు వారు అడిగిన చోటనే ఉపాధి కల్పించి పనులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎపిఒ చెన్నకేశవులు తెలిపారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం నిరుపేదలకు వరం లాంటిదని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి హారిక, సింగల్ విండో చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఎంపిడిఒ గంగయ్య ,ఎంపిటిసిలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్



సిమెంట్ లేక ఆగిన అదనపు గదుల నిర్మాణం

సిమెంట్ కొరతతో ఆగిన గదుల నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో అదనంగా బాలికల కళాశాలకు పది రూములు మంజూరు అయ్యాయి. వీటిలో ఐదు రూముల నిర్మాణాలను చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. రూముల నిర్మాణానికి ఫిల్లర్స్ వేసి ఫిబ్రవరి నుంచి కంకర, ఇసుకను తోలి సిద్ధంగా ఉంచారు. సిమెంట్ లేకపోవడంతో పనులు ఆగిపోయాయి. నాడు-నేడు కింద సిమెంటు అందక పోవడంతో నిర్మాణ పనులు చురుగ్గా సాగడం లేదు. ఈ నెలలో శెలవులు ఉండటంతో సిమెంటు అందుబాటులో ఉంటే గదుల నిర్మాణం పూర్తవు తుంది. జూన్ 12 నుంచి తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి సిమెంటును ఏర్పాటు చేసి గదుల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహాభారత ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పురాణ ఇతిహాసమైన మహాభారతం ప్రాముఖ్యాన్ని, విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన మండల పరిధిలోని బాలినాయనపల్లె గ్రామంలో జరుగుతున్న మహాభారత యజ్ఞ కార్యక్రమాన్ని సందర్శించారు. అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో బాలినాయనపల్లి వద్ద ఘనంగా స్వాగతం పలికారు. వైసిపి నాయకులతో కలిసి చౌడేశ్వరి దేవి, ధర్మరాజుల ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భాగవతారాణి వరలక్ష్మి ప్రదర్శించిన బకాసుర వధ, బలిబండి హరికథా కాలక్షేపాన్ని వీక్షించారు. మహాభారత యజ్ఞం నిర్వహణకు తనవంతుగా సాయంగా రూ.15వేలు, గుడికి రూ.1100ల నగదు సాయాన్ని విరాళంగా అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు నవాజ్‌బాషా, నాగరాజా, వెంకటరమణ, వైసిపి నాయకులు గడ్డం నరసింహారెడ్డి, ఎర్రయ్య, రామారావు, ఈశ్వర, ఖాసీం, పచ్చోళ్ళ శీన, మదన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు దివానా సాహెబ్ ఉరుసు ఉత్సవాలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బస్టాండ్ నుంచి దివానా సాహెబ్ ఉరుసు జెండా మాను వరకు విద్యుత్ బల్బులతో అలంకరించారు. శుక్రవారం గంధం, శనివారం ఉరుసు ఖవ్వాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రాత్రులలో పోటీలలో టీవీ యాంకర్ల ద్వారా పోటీలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే దర్గా కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆరిఫ్ షాదుఖాన్‌బాషా, జమ్రుద్‌బాషా, రంగీన్‌బాషా, మస్తాన్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-పీలేరు

చదువు పూర్తయ్యాక విద్యార్థులు ఉద్యోగ వేటలో పడకుండా, వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని సిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఆయన విద్యార్థులకు ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను యువ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్వయం ఉపాధి పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. పిఎంఎఫ్‌ఎంఇ ప్రధానమైందని చెప్పారు. ప్రభుత్వాలు ఈ పథకం ద్వారా ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు అనేక ప్రోత్సాహకాలు, రుణాలు మంజూరు చేస్తున్నాయన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయదలచుకున్న వారు యూనిట్ విలువలో 10 శాతం మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన 90 శాతాన్ని బ్యాంకుల ద్వారా రుణంగా పొందాల్సి ఉంటుందన్నారు. యూనిట్ విలువలో 35 శాతం సబ్సిడీ ఉంటుందని, రూ.10 లక్షల రుణం వరకు బ్యాంకులకు ఎలాంటి స్యూరిటీలు చూపించాల్సిన అవసరం లేదన్నారు. ఆహారశుద్ధి రంగాన్ని బలోపేతం చేయడం, ఆహార శుద్ధి పరిశ్రమలకు రుణసదుపాయం కల్పించడం, పరిశ్రమల సామర్థ్యాల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక, ఆర్థిక సాయం అందించడం, ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండింగ్ తోడ్పాటుకు కూడా పీఎంఎఫ్‌ఎంఇ పథకం సహాయ, సహకారాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు బోదేషావలి, రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు జయబ్బ నాయుడు, సిఎస్ఆర్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ చింతల విజయ భాస్కరరెడ్డి, హెచ్ఐఒ సుకుమార్ రెడ్డి, 'ఆపిలిప్' సంస్థ అధికారి బోజి రాజు, ఎపిమాస్ ప్రాజెక్టు మేనేజర్ బార్గవి, విహెచ్ఎలు దశర థరెడ్డి, వనజ, తిరు మల, రాజే శ్వరి పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిహెచ్‌ఒ రవిచంద్ర

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉసురు తీసిన లోన్‌యాప్

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తండ్రి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

లోన్‌యాప్ బారినపడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండ లంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండ లంలోని సూరప్ప వారిపల్లె పంచాయతీ, దెయ్యా లపల్లెలో నివాసముండే ఎస్.జయరాంరెడ్డి, శ్యామ లకు శ్రావణ్‌కుమార్‌రెడ్డి(24), హారికలు ఇద్దరు సంతానం కలరు. శ్రావణ్‌కుమార్ రెడ్డి క్యాప్ జెమినీ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం లోన్ యాప్ ద్వారా కొంత లోను తీసుకున్నట్లు తల్లి దండ్రులకు తెలిపాడు. తాను మానసికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నానని, తనకు రూ.4లక్షలు నగదు కావాలని అడిగినట్లు తండ్రి జయ రాంరెడ్డి తెలిపారు. వారం లోగా డబ్బు సర్దుతామని ఎటువంటి ఇబ్బంది పడ వద్దని సూచించిమన్నారు. ఇదిలా ఉండగా గురువారం మొరంపల్లికి చెందిన మా దూరపు బంధువు రెడ్డెప్పరెడ్డి తనకు ఫోన్ చేసి ఊరికి సమీపంలోని పూత పల్లేశ్వర స్వామి ఆలయంలోని గ్రిల్‌కి టవల్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడని సమాచారం అందిం చాడన్నారు. తాము వెంటనే గుడి వద్దకు చేరుకొని ఉరి వేసుకున్నది శ్రావణ్ కుమార్‌రెడ్డి అని గుర్తించి కన్నీరు మున్నేరుగా విలపిం చామన్నారు. నా కుమారుడు అడిగిన డబ్బులు సకాలంలో సమకూర్చలేక పోవడం వల్లనే మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడి ఆత్మహత్యపై విచారించి తమకు న్యాయం చేయా లని జయరాంరెడ్డి పోలీసులకి ఇచ్చిన ఫిర్యాదుల పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



శ్రావణ్ కుమార్ రెడ్డి (ఫైల్ ఫొటో)

ఇంటి స్థలం విషయంలో ఘర్షణ : మహిళకు గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

ఇంటి స్థల విషయంలో ఘర్షణ పడి మహిళకు తీవ్రగాయాలైన సంఘన మండలంలో చోటు చేసకుంది. మండల పరిధిలోని ఉడుమువారిపల్లెకు చెందిన షకీలాబేగంకు షేక్ సలాం సోదరులకు ఇంటిస్థలం విషయమై ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన షకీలా బేగంను కడప రిమ్స్ కు తరలించారు. ఈ మేరకు రిమ్స్ అవుట్ పోస్టులో కేసు నమోదు చేసి రామాపురం పోలీస్‌స్టేషన్‌కు బదలాయించారు. ఈ మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.